సిఆర్‌పిఎఫ్ జవాన్ మృతి

ప్రసాదరావు (ఫైల్)

వజ్రపుకొత్తూరు : మండలంలోని బెండి పంచాయతీ మహాదేవిపురానికి చెందిన సిఆర్ పిఎఫ్ జవాన్ తమ్మినాన ప్రసాదరావు (36) అనారోగ్యంతో మృతి చెందారు. గత ఆరు నెలలుగా రాయిగడలోని రెజిమెంట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తండ్రి శిమ్మయ్య కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది. ఆదివారం మహాదేవిపురంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. 2010లో సిఆర్ పిఎఫ్ జవాన్‌గా విధుల్లో చేరారు. సెలవుపై గ్రామానికి వస్తే అందరితో చలాకీగా, సరదాగా ఉండేవాడని స్నేహితులు చెబుతూ కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె ఉన్నారు.

బూర్జ మండలం పనుకువలస, కిల్లంతర గ్రామాల మధ్య పొలాల్లో ధాన్యం కుప్పలు

లక్ష్యం చేరుకునేనా..?

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చివరి దశకు చేరింది. ధాన్యం సేకరణలో తొలుత సాంకేతిక సమస్యలు, ధాన్యం నాణ్యంగా లేవని మిల్లరు నిరాకరించడం వంటి సమస్యలు ఎదురైనా క్రమేణా కొనుగోలు పుంజుకున్నాయి. 2023 ఖరీఫ్‌లో వచ్చిన దిగుబడిలో సుమారు 80 శాతం కొనుగోలు చేసినట్లు అధికారుల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లోని రైతుల వద్ద మరో లక్ష ఎకరాల వరకు ధాన్యం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అపరాల సాగుతో నూర్పులకు వీల్లేక వరికుప్పలు పొలాల్లోనే ఉన్నాయి. నూర్పులు తర్వాత కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

- **ఇప్పటివరకు 4.13 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు**
- **అపరాల సాగుతో పలు మండలాల్లో జరగని నూర్పులు**
- **రైతుల వద్ద మరో లక్ష టన్నులు ఉంటుందని అంచనా**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్‌లో 3,51,843 ఎకరాల్లో వరి వేశారు. ఇందులో 3,50,765 ఎకరాలకు పంటల క్రాపింగ్ జరిగింది. 3,34,330 ఎకరాలకు ఇకెవైసి పూర్తయింది. ఈ ఏడాది 8.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో 7,87,447 మెట్రిక్ టన్నులు మార్కెట్‌లోకి వస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం వరి సాధారణ రకం క్వింటాలుకు రూ.2,183, గ్రేడ్-ఎ రకానికి రూ.2,203 మద్దతు ధర ప్రకటించింది. ధాన్యం కొనుగోలుకు అధికారులు జిల్లావ్యాప్తంగా 606 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలను మూడు కేటగిరీలుగా విభజించారు. రెండు వేలు పైబడి ధాన్యం సేకరించే అవకాశమున్న కేంద్రాలను ఎ-కేటగిరీగా, వెయ్యి నుంచి రెండు వేల టన్నుల్లోపు వరకు కొనుగోలు చేసే వాటిని బి-కేటగిరీగా విభజించారు. వెయ్యి టన్నుల కంటే తక్కువ ధాన్యం కొనుగోలుకు అవకాశం ఉన్న వాటిని సి-కేటగిరీగా నిర్ణయించారు.

మందగించిన కొనుగోలు

జిల్లాలో పండగ సీజన్ ముందు వరకు ధాన్యం కొనుగోలు చాలా జోరుగా సాగాయి. ఆ తర్వాత మందగించాయి. ఆమదాలవలస, నరసన్నపేట, పొందూరు, జి.సిగడాం, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం తదితర మండలాల్లో ధాన్యం సేకరణ లక్ష్యానికి అనుగుణంగా జరగలేదు. పెసర, మినుము తదితర పంటలను సాగు చేస్తుండడంతో అక్కడ నూర్పులు జరగలేదు. అపరాల తర్వాత అక్కడ ధాన్యం వచ్చే అవకాశముంది. దీంతో ఆయా ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను తెరిచే ఉంచారు. జలుమూరు, సారవకోట, పోలాకి, బూర్జ, తదితర ప్రాంతాల్లో పంట వేగంగా చేతికి రావడంతో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కావడంతో కేంద్రాలను మూసివేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి, కవిటి మండలాల్లో ఈసారి పంట పెద్దగా లేకపోవడంతో అక్కడా కొనుగోలు పూర్తయ్యాయి.

మండలాల్లో కొనుగోలు పరిస్థితి ఇలా...

జిల్లాలో గ్రేడ్-ఎ, సాధారణ రకం ధాన్యం కలిపి మొత్తం 4.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. కంచిలిలో అత్యల్పంగా కేవలం 89.56 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. కవిటిలో 728.52 మెట్రిక్ టన్నులు, ఇచ్ఛాపురంలో 3,404.84 మెట్రిక్ టన్నులు, పొందూరులో 3,367.24 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్నారు. లావేరులో 4,505.72 మెట్రిక్ టన్నులు, ఎచ్చెర్లలో 3,142.64 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లాలో అత్యధికంగా జలుమూరులో 31,861.44 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఆ తర్వాత స్థానంలో సారవకోట ఉంది. సారవకోటలో 24,532.76 మెట్రిక్ టన్నులు కొన్నారు. నరసన్నపేటలో 26,336.60 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారు. నందిగాంలో 21,515.32 మెట్రిక్ టన్నులు, మెళియాపుట్టిలో 21,175 మెట్రిక్ టన్నులు, కొత్తూరులో 20,439.92 మెట్రిక్ టన్నులు, కోటబొమ్మాళిలో 21,731.72 మెట్రిక్ టన్నులు సేకరించారు.

రూ.111 కోట్ల బకాయిలు

జిల్లాలో 96,068 మంది రైతుల నుంచి 914.15 కోట్ల ధాన్యం కొనుగోలు చేశారు. మిల్లర్లకు రూ.883.35 కోట్ల విలువైన ధాన్యం చేరింది. ఇప్పటివరకు రైతులకు రూ.772.03 కోట్లు చెల్లించారు. మరో రూ.111.32 కోట్లు చెల్లించాల్సి ఉంది. గన్నీ బ్యాగుల కోసం 1.88 కోట్లు, లేబర్ ఛార్జీల కింద రూ.5.95 కోట్లు చెల్లించాల్సి ఉంది. ధాన్యం రవాణా ఛార్జీల కింద రూ.8.71 కోట్లు చెల్లించాల్సి ఉంది.

వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి అప్పలరాజుకు వినతి

ప్రజాశక్తి - పలాస

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక ప్రగతి భవన్‌లో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ని ఆశాలుగా మార్పు చేయాలని కోరారు. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్, వేతనంతో కూడిన మెటర్నటీ లీవ్ అమలు చేయాలన్నారు. పనిభారం తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, యాప్‌లు, సచివాలయ డ్యూటీలు రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. రూ.పది లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం, రూ.ఐదు లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కోవిడ్ కాలంలో మరణించిన ఆశాలకు రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, నియామకాలను ప్రభుత్వమే చేపట్టి రాజకీయ జోక్యాన్ని నివారించాలన్నారు. ఆశాలకు ఎఎన్‌ఎం ట్రైనింగ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎఎన్‌ఎం, జిఎన్‌ఎం ట్రైనింగ్ పొందిన ఆశావర్కర్లకు ఎఎన్‌ఎం, హెల్త్ సెక్రటరీలు, స్టాఫ్ నర్సు నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రికి విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆశావర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి ఎం.లావణ్య, నాయకులు వై.హేమలత, ఐ.యజ్ఞశ్రీ, సబితా పాత్రో, వి.రజని, ఎల్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోర్టు పనులు పరిశీలన

బ్రేక్ వాటర్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, నౌపడలో పునరావాస కాలనీలను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ మూలపేటలో పర్యటించి పోర్టులో చేపడుతున్న పనులను పోర్టు మేనేజర్ శంకర్‌ను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. నార్త్ బ్రేక్, సౌత్ బ్రేక్ వాటర్ నిర్మాణ పనులను సముద్రంలోకి వెళ్లి పరిశీలించారు. తీరంలో చేపడుతున్న సివిల్ వర్క్, పోర్టు అప్రోచ్ రోడ్డు, పోర్టు డిజైనింగ్ మ్యాపు సహాయంతో పరిశీలించారు. అనంతరం నౌపడలో పునరావాస కాలనీని పరిశీలించారు. ప్లాట్లు గుర్తించి నిర్వాసితులకు అందజేసేందుకు త్వరితగతిన కాలనీ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్‌అండ్‌బి, రెవెన్యూ, సర్వే అధికారులతో మాట్లాడి నిర్మాణ పనుల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ మౌళి, విఆర్ఒ ప్రసాద్ పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

మాట్లాడుతున్న ఎస్‌పి జి.ఆర్.రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రజలకు అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తూ బదిలీ అయిన పోలీసు అధికారులకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బదిలీ అన్నది ప్రతి ఉద్యోగికీ సహజమన్నారు. అంకితభావంతో అందించిన సేవలు గుర్తుండిపోతాయని చెప్పారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ డిఎస్‌పిలు, సిఐలు తీసుకున్న పటిష్ట చర్యలతో నేరాలను కొంతవరకు తగ్గించామని తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న సమయంలో ఏవిధంగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారో అదేవిధంగా పనిచేసే ప్రతిచోటా తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఎఎస్‌పి (క్రైమ్) టి.పి విఠలేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో మూడున్నరేళ్ల పాటు పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. ఎస్‌పి పర్యవేక్షణలో అనేక కేసులు ఛేధించడాన్ని గుర్తుచేసుకున్నారు. ఎఎస్‌పి (అడ్మిన్) జె.తిప్పేస్వామి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బాధ్యతగా పనిచేసి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. తన సేవలను గుర్తించి రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా పతకానికి నామినేట్ చేయడంపై ఎస్‌పి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కొద్దికాలం పనిచేసినా అందరూ సహాయ సహకారాలు అందించారన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఎఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, తిప్పేస్వామి, డిఎస్‌పిలు కె.బాలరాజు, ఎస్.వాసుదేవ్, సిహెచ్.జి.వి.ప్రసాద్, సిఐలు ఆదాం, ఈశ్వర్‌ప్రసాద్, దాలిబాబు, లక్ష్మణరావు, ఆర్ఐ ఉమామహేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిఎస్‌పిలు నాగేశ్వర్ రెడ్డి, బాలచంద్రారెడ్డి, శృతి, సిఐలు వేణుగోపాల్, పైడయ్య, అవతారాం, ప్రసాదరావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పలాస: విశాఖపట్నం చినగదిలి మండల తహశీల్దార్ సనపల రమణయ్యను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కళింగ సంక్షేమ సంఘం నాయకులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు డిమాండ్ చేశారు. తహశీల్దార్ రమణయ్యకు నివాళ్లర్పిస్తూ స్థానిక మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాయితీపరుడైన తహశీల్దార్ రమణయ్య విధి నిర్వహణలో ప్రజా మన్ననలు చూరగొన్నారని చెప్పారు. వజ్రపుకొత్తూరు తహశీల్దార్‌గా 2012లో పనిచేశారని, ఆ సమయంలో మండల సమస్యలను పరిష్కరించారని గుర్తు చేశారు. విశాఖ జిల్లాలో భూ దందాలను అరికట్టారని, దీన్ని జీర్ణించుకోలేక హత్య చేశారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, దువ్వాడ శ్రీకాంత్, రామానంద స్వామి పాలవలస వైకుంఠ రావు డబ్బీరు నాగు, కంచరాన భుజంగరావు, సత్యానంద్ పాల్గొన్నారు.

రేపు రాష్ట్రస్థాయి సైన్స్ కళాజాతా

కళాజాతా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేయడంలో భాగంగా ఈనెల ఆరో తేదీన నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో రాష్ట్రస్థాయి సైన్స్ కళాజాత ప్రారంభమవుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ తెలిపారు. ఈ జాతాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జన విజ్ఞాన వేదిక సమావేశంలో వారు మాట్లాడారు. 6న ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కానున్న జాతా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి కళా ప్రదర్శనల ద్వారా ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు, ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయ కుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.దేవదత్తం, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు జి.మురళీధర్ పాల్గొంటారని చెప్పారు. జెవివి ప్రతినిధులు, సైన్స్ ఉద్యమాభిమానులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 11, 12 తేదీల్లో పల్నాడు జిల్లా ఎడ్లపాడులో చెకుముకి రాష్ట్రస్థాయి సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి విజేతలుగా నిలిచిన ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, గీతాంజలి స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. సమావేశం అనంతరం జెవివి వార్షిక డైరీ, కళాజాతా కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షులు సామ సంజీవరావు, జిల్లా కోశాధికారి వి.ఎస్ కుమార్, నాయకులు తంగి ఎర్రమ్మ, పేడాడ వేదవతి, ఎ.వాసుదేవరావు, యోగేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రాధాన్యం

రెవెన్యూ మంత్రి ధర్మాన

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి - గార

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ పలు పనులు చేపడుతోందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం సిఎస్‌పి రోడ్డు నుంచి కొర్ని కొర్లాం మీదుగా కొమరవానిపేట వరకు 7.2 కిలోమీటర్ల రోడ్డు, రూ.1.4 కోట్లతో నిర్మించిన బిటి రోడ్డును మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం వైసిపి ప్రభుత్వ సమ ప్రాధాన్యాలు అని చెప్పారు. వాటి ఆధారంగా పాలనలో ముందుకు వెళ్తుందని తెలిపారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం దివాళా తీస్తుందని ఇన్నాళ్లు గగ్గోలు పెట్టిన చంద్రబాబు నాయుడు, ఎన్నికల నేపథ్యంలో ఇప్పుడు అవే పథకాలు ఇస్తానని చెప్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ఎన్ని హామీలు ఇచ్చినా, ఎన్ని మాటలు చెప్పినా రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేసిన అభివృద్ధి కన్నా ఈ ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎక్కువ అభివృద్ధి చేశారని చెప్పారు. ఒకవైపు సంక్షేమ పథకాలు అందిస్తూ మరోవైపు అభివృద్ధి చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని చంద్రబాబు చెప్తున్నారని... ఆయన సృష్టించిన సంపద, చేసిన అభివృద్ధిని చూసే ప్రజలు పక్కన కూర్చోబెట్టారని విమర్శించారు.

వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో సహస్ర కోలాటం

రెండున్నర గంటల పాటు నిర్విరామంగా ప్రదర్శన

కోలాటం ఆడుతున్న మహిళలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

1050 మంది మహిళలు ఏకరూప వస్త్రధారణతో రెండున్నర గంటల పాటు నిర్విరామంగా ప్రదర్శించిన సహస్ర కోలాటం వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకుంది. నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానంలో ఆదివారం నిర్వహించిన సహస్ర కోలాట ప్రదర్శనను కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, ఎస్‌పి జి.ఆర్ రాధిక ప్రారంభించారు. కళింగ కోమటి మహిళా సంఘం అధ్యక్షులు మల్లా పద్మజ నేతృత్వాన ముగ్గురు సభ్యుల బృందం ఈ రికార్డు కోసం నెల రోజుల పాటు శ్రమించారు. ఈ ప్రయత్నానికి గుర్తింపును తీసుకురావాలన్న ఆలోచనతో హైదరాబాద్‌కు చెందిన వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రతినిధులను సంప్రదించారు. సంస్థ ప్రతినిధులు నిరంజన్ భట్, థామస్, ప్రియ రాజ్ సమక్షంలో ఆదివారం ఈ ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ తెలుగు వారి సంస్కృతిని ప్రతిబింబించేలా సహస్ర కోలాటం నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. కళింగ కోమటి సామాజిక తరగతికి చెందిన వేలాది మంది మహిళలు ఒక్కటై కోలాటం ప్రదర్శించడం సమైక్యతను చాటుతుందన్నారు. ఎస్‌పి రాధిక మాట్లాడుతూ సహస్ర కోలాటం ఆకట్టుకుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వెయ్యి మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కోలాటం ఆడుతున్న ప్రతి మహిళ ఒక పేద మహిళను దత్తత తీసుకొని ఆదుకోవాలన్నారు. ఆర్థికంగా, ఆరోగ్యంగా భరోసా కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కళింగ కోమటి సంఘ రాష్ట్ర అధ్యక్షులు పట్నాల శ్రీనివాస్, తంగుడు జోగారావు, కోరాడ హరగోపాల్, బోయిన గోవిందరాజులు, ఊణ్ణ నాగరాజు, పి.వి రమణ, కళింగ కోమటి మహిళా సంఘ కార్యదర్శి లాడి శాంతిప్రియ, కోశాధికారి తంగుడు జ్వాల, కోరాడ ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌తో ఆవిష్కరణలకు నాంది

డిఇఒ కె.వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థి దశలోనే ఆలోచనలకు పదును పెట్టి సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలికేందుకు సైన్స్ ఫెయిర్ దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. నగరంలోని పాత హౌసింగ్‌బోర్డు కాలనీలో గల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మెగా సైన్స్ ఫెయిర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. రికార్డు స్థాయిలో ఒకే పాఠశాల నుంచి 554 మంది విద్యార్థులు 335 ప్రాజెక్టులను ఇందులో ప్రదర్శించారు. నామమాత్ర డిస్‌ప్లే మోడల్స్ కాకుండా వర్కింగ్ మోడల్స్ ప్రదర్శించారు. తాము నేర్చుకున్న అంశాలకు తోడు తమ ఆలోచనలకు పదునుపెట్టి ప్రాజెక్టుల రూపంలో ప్రదర్శించారు. నిత్య జీవనంలో ఎదురయ్యే చాలా సమస్యలకు పరిష్కారం చూపే ప్రాజెక్టులు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించాల్సిన అవసరం తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ పాఠశాల డైరెక్టర్ అన్నెపు లావణ్య రాణి, ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, సైన్స్ ఫెయిర్ ఇన్‌ఛార్జి సౌజన్య, కో-ఆర్డినేటర్లు దీపాకుమారి, దేవి, విజయ పాల్గొన్నారు.

ప్రాజెక్టును పరిశీలిస్తున్న డిఇఒ వెంకటేశ్వరరావు

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- **మెరుగైన ఫలితాల సాధనకు ప్రణాళికలు**
- **మార్చి 18 నుంచి 'పది' పరీక్షలు**
- **149 పరీక్షా కేంద్రాల ఏర్పాటు**
- **జిల్లా విద్యాశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యమని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. మార్చి 18వ తేదీ నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు 149 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెరుగైన ఫలితాలు సాధించడం కోసం కార్యాచరణను సిద్ధం చేశామన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. 'ప్రజాశక్తి' ముఖాముఖిలో పలు అంశాలను వెల్లడించారు.



? పదో తరగతి పరీక్షలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నాం. మార్చి 18వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 30వ తేదీ వరకు పరీక్షలు జరుగనున్నాయి. జిల్లాలో మొత్తం 561 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 29,745 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో ఈ ఏడాది 149 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇందులో ఎ-కేటగిరీ కేంద్రాలు 57, బి-కేటగిరీ 29, సి-కేటగిరీ 63 కేంద్రాలు ఉన్నాయి.

? పరీక్షలకు విద్యార్థులను ఏవిధంగా సన్నద్ధం చేస్తున్నారు?

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నాం. ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా ప్రత్యేక శ్రద్ధతో చదివించి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. నిపుణులు తయారు చేసిన మాదిరి ప్రశ్నాపత్రాలను సాధన చేయిస్తున్నాం. ఎంపిక చేసిన అంశాలపై పట్టు సాధించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నాం. విద్యార్థులు శ్రద్ధతో చదివితే మంచి ఫలితాలు సాధ్యమవుతాయి. ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతోంది. పాఠశాల స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ ఉంది. ఇంటి వద్ద తల్లిదండ్రులు పర్యవేక్షణ పెరిగితే ఉత్తమ ఫలితాలు అందుకోవడానికి తోడ్పడుతుంది.

? వెనుకబడిన విద్యార్థులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

పాఠశాల స్థాయిలో తరగతుల నిర్వహణలో అత్యంత శ్రద్ధ వహించడం వల్ల వెనకబడిన విద్యార్థుల్లో పరీక్షలపై శ్రద్ధ పెరిగింది. వారికి ప్రీ ఫైనల్ పరీక్షలతో పాటు పరీక్షలకు అనువైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. తరగతి గదుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించడం, అదనపు సమయం చదివించడం వంటి చర్యలు చేపడుతున్నాం. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులు ఇళ్ల వద్ద మరికొంత సమయం కష్టపడి చదవాలంటే వారికి అనువైన వాతావరణాన్ని తల్లిదండ్రుల నుంచి ఉండాలి. ప్రధానంగా టివి, మొబైల్ ఇతర ప్రసార సాధనాలకు దూరంగా ఉంచాలి.

? పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

పదో తరగతి విద్యార్థులకు సంబంధించి పాఠశాలల్లో అమలు చేస్తున్న పలు కార్యక్రమాల పర్యవేక్షణపై దృష్టిసారించాం. క్షేత్రస్థాయిలో జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్ర శిక్ష ఎపిసి, ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, సీనియర్ ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ ఉంది. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. కేంద్రాల్లో ఎలాంటి సమస్య లు లేకుం డా చూడాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం వంటివి తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

మంత్రితో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

జీడికి మద్దతు ధర కల్పించాలి

ప్రజాశక్తి- పలాస

ఉద్దానంలో విస్తారంగా పండుతున్న జీడి పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించేందుకు కృషి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు పత్తిరి దానేషు, సాలిన వీరాస్వామి, పిండి వెంకటరావులు కోరారు. ఈ మేరకు పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మాట్లాడుతూ వారు మాట్లాడుతూ రైతులు, రైతు సంఘాలు, ఉద్యమకారులు, ప్రజాసంఘాలు అనేక రూపాల్లో పోరాటాలు చేశాయని అన్నారు. ప్రయివేటు వ్యాపారుల దోపిడీ నుంచి రైతులను ఆదుకోవాలని కోరినా ఇప్పటి వరకు వరకు గిట్టుబాటు ధర సమస్య పరిష్కరించబడలేదని వివరించారు. జీడిపండించే రైతులకు మద్దతు ధర కోసం రాష్ట్ర బడ్జెట్‌లో కొంత నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ... వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. సిఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. వినతిపత్రం అందజేసిన దుశ్యంత్, దున్న కృష్ణ, రెయ్యి భీమారావు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

తాగునీటికి ఇబ్బందులు కలిగించొద్దు

ప్రజాశక్తి- నందిగాం

వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎంపిపితో పాటు సభ్యులు ఎం.సంజీవరావు, ఎ.శ్రీనివాసరావు, వై.చక్రవర్తిలు అధికారులను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన మండల సమావేశం ఆదివారం నిర్వహించారు. ముందుగా వ్యవసాయంపై జరిగిన చర్చిలో ధాన్యం కొనుగోలులో రైస్ మిల్లర్లు జోక్యం చేసుకోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని దీనబంధుపురం సర్పంచ్ మడపాల సంజీవరావు అన్నారు. దీనిపై మండల ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడుచుకున్నామని తెలిపారు. మంచిగా ఉన్న రహదారులపైనే పనులు చేపట్టడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఆర్‌అండ్‌బి అధికారి విజయ్ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాప్తికి రోడ్డు పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాజారావు, ఆశారావు, యర్రాచక్రవర్తి, కురమాన కృష్ణారావు, జె.జయరాం పాల్గొన్నారు.

దిలీప్ చక్రవర్తిని సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

బదిలీ తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి- లావేరు

జిల్లాలోనే లావేరు మండలం ఆదర్శంగా నిలుస్తోందని, మండల ప్రజల సహకారంతోనే ముడున్నారేళ్ల ప్రశాంతంగా విధులు నిర్వర్తించానని పూర్వ తహశీల్దార్ సాధు దిలీప్ చక్రవర్తి అన్నారు. ఇంతవరకు ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేస్తూ ఇటీవల విజయనగరం జిల్లా తెర్లాం మండల తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లిన దిలీప్ చక్రవర్తిని ఆదివారం తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బంది, విఆర్‌ఒలు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. డిటి నారాయణ మూర్తి అధ్యక్షతన సభ ఏర్పాటు చేసి దిలీప్ చక్రవర్తిని ఘనంగా సన్మానించారు. తహశీల్దార్‌గా బదిలీపై వచ్చిన పి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ తనకు కూడా ప్రజలు, ఉద్యోగ సిబ్బంది సహాయ సహకారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో విఆర్‌ఒల మండల సంఘం అధ్యక్షుడు లంక అప్పారావు, సర్వేయర్ శ్రీధర్ రెడ్డి, సీనియర్ సహాయకులు రత్నాకర్, విఆర్‌ఒలు దన్నాన స్వామినాయుడు, కీర్తి వెంకటరమణ, లక్ష్మణరావు, శ్రీనువాసురావు, భాస్కరరావు, కిరణ్మయి, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు అండ

ప్రజాశక్తి- పొందూరు

ఆర్థికసాయం అందజేస్తున్న శంకర్ స్నేహితులు

చిన్నతనం నుంచి వారంతా ఆడారు పాడారు, కలిసి చదువుకున్నారు. పెద్దవారై ఎవరికివారు ఉద్యోగాలు చేసుకుంటూ ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకుంటూ తమ కుటుంబాలతో జీవనం సాగిస్తున్నారు. ఇంతలో రహదారి ప్రమాదం రూపంలో తన చిన్ననాటి మిత్రునితో పాటు ఆయన భార్య మృతి చెందిన విషయం తెలియడంతో వారంతా తల్లడిల్లిపోయారు. దీంతో అనాధలైన చిన్నారులను ఓదార్చడంతో పాటు అండగా ఉంటామని భరోసా ఇచ్చి తమవంతు ఆర్థికసాయాన్ని అందించారు. ఇటీవల విశాఖపట్నం వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో స్నేహితుడు కొండేటి శంకర్ దంపతులు మృతి చెందడంతో మండలంలో మలకాం(జాడపేట)లో ఉన్న కుమారులను కలిసి ఓదార్చారు. దీంతో శంకర్‌తో కలిసి 1998-99 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న స్నేహితులంతా చిన్నారులకు రూ.30వేలు ఆర్థికసాయం అందించారు. ఆర్థికసాయం అందించిన వారిలో రాంబిల్లి బంగారురాజు, జామాన అప్పలనాయుడు, రాంబిల్లి శంకర్, మాసాడ భోగిరాజు, కొమ్మన సత్యనారాయణ, చిప్పాడ శ్రీనివాసరావు, పోలాకి రాజారావు, లింగాల నర్సింహమూర్తి, బారిష్టర్ పార్వతీశం ఉన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, అధికారులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పలాస: ప్రతిఒక్కరూ మత్తు, మద్యపానానికి దూరంగా ఉన్నప్పుడే కేన్సర్ రాకుండా నివారించవచ్చని జెమ్స్ ఆస్పత్రి మేనేజర్ చిన్నారావు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనేల గోపాల్ అన్నారు. కాశీబుగ్గలో ప్రపంచ కేన్సర్ దినోత్సవ సందర్భంగా పలాస రామకృష్ణ, నరేంద్ర సేవా సమితి, గ్రీన్ ఆర్మీ, క్యాజు ల్యాండ్, ప్రశాంతి సత్యసాయి సేవా సమితి, జెమ్స్ రాగోలు ఆస్పత్రి సంయుక్తంగా పలాస ఇందిరా గాంధీ విగ్రహం నుంచి మూడు రోడ్ల కూడలి కాశీబుగ్గ వరకు ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలు జోలికి వెళ్లకుండా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో క్యాజుల్యాండ్ మల్ల జయశ్రీ, ప్రశాంతి సేవా సమితి జామి మోహనరావు, గ్రీన్ ఆర్మీ గౌరవ అధ్యక్షులు బత్తిని ఓంకార్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు అస్పాన మధుబాబు, రాము పాత్రో, నీలకంఠ పాత్రో, భాస్కర్, ఆర్.సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు దాసరి శ్రీనివాసరావు, దుర్యోధన, గేదెల జగదీష్, ఇరిగేషన్ అధికారి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ మేథోత్సవం

కవిటి : విజేతలతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- కవిటి

ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఘనంగా సైన్స్ మేథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రతిభా పరీక్షలో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి తెలుగు, ఆంగ్ల, ఒడియా మాధ్యమాలకు చెందిన 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ఆంగ్ల మాధ్యమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన మండల ఉదయ్, రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.సుజాత, బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్.శ్రీకర్, తెలుగు మాధ్యమంలో ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.కులశేఖర, బి.తిరుపతి, నెలవంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.హేమంత్, ఒడియా మాధ్యమంలో రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సిహెచ్.శ్యామ్‌సాహు, రంజన్ బదిత్య, కవిటి జిల్లా పరిషత్ ఒడియా ఉన్నత పాఠశాలకు చెందిన పార్వతి బెహరా విజేతలుగా నిలిచారు. వీరికి మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెందాళం మల్లేశ్వరరావు చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం ఎంఇఒను సన్మానించారు. మండల ఫిజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడు కె.రామారావు, ప్రధాన కార్యదర్శి పిరియా వేణుగోపాల్, కోశాధికారి బి.జయరాం, కన్వీనర్ ఎల్.వెంకటరావు, మహిళా కార్యదర్శి టి.రాధిక, ఉపాధ్యాయులు బి.లక్ష్మణమూర్తి, మొర్రి గోపి, రంగారావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

టెక్కలి: ఫోరం ఆధ్వర్యాన మేథోత్సవం మండలస్థాయి ప్రతిభా పరీక్ష స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పది ఉన్నత పాఠశాలల నుంచి సుమారు 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ నెల 18న జిల్లా కేంద్రంలో నిర్వహించే పరీక్ష హాజరు కానున్నారని భౌతిక, రసాయనిక శాస్త్ర ఫోరం టెక్కలిశాఖ అధ్యక్షులు రోణంకి గౌరీప్రసాద్ తెలిపారు. మండలస్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలో తెలుగు మాధ్యమంలో నర్సింగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మొదటి, ద్వితీయ స్థానాలు సంసాదించారని అన్నారు. సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తృతీయస్థానాన్ని సంపాదించుకున్నారు. ఆంగ్ల మాధ్యమంలో ప్రథమ, తృతీయ స్థానాలను బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సాధించగా, సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని సంపాదించారని తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు సుభాష్, కొండేటి అచ్యుతరావు, బడగల ప్రమీల, మోహిని, రామముని రమేష్‌కుమార్, వూన ప్రకాశరావు, రోణంకి విజయ్‌కుమార్, రుషి పాల్గొన్నారు.

టెక్కలి : ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

బటన్ నొక్కారు సరే.. సొమ్ములేవి?

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

సిఎం సార్ బటన్ అయితే నొక్కారు... సొమ్ములు ఎప్పుడు పడతాయోనని లబ్ధిదారులు ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. గత నెల 23న నాలుగో విడత ఆసర సొమ్ములు విడుదల చేసేందుకు సభపెట్టి సీఎం సార్ బటన్ నొక్కారు. ఇప్పటికీ ఒక్క గ్రూప్‌నకూ సొమ్ము పడితే ఒట్టు. అయితే గత నెల 29న కోటబొమ్మాళి మండల కేంద్రంలో స్థానిక వైసిపి నాయకులు, వెలుగు అధికారులు కలిసి మండల కేంద్రంలో డ్వాక్రా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డ్వాక్రా మహిళంతా తప్పని సరిగా హాజరు కావాలని, డబ్బులు మీ ఖాతాల్లో వెంటనే వేస్తామని చెప్పటంతో మహిళమంతా వ్యవసాయ పనులు, కూలీ పనులు మానుకొని ఆటోలకు డబ్బులు కట్టుకొని మరీ హాజరయ్యారు. తీరా సమావేశం జరిగి ఆరు రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు తమకు డబ్బులు అందలేదని మహిళలు వాపోతున్నారు. ఆసర సొమ్ముల కోసం నెల రోజుల ముందుగానే డ్వాక్రా మహిళచే వేలిముద్రలు వేయించుకున్నారు. ఇప్పుడు డ్వాక్రా డబ్బుల కోసం బ్యాంకుల చుటూ ప్రదీక్షణలు చేస్తున్నారు. దీంతో డబ్బులు వేయకుండా బటన్ ఎందుకు నొక్కాలని, మాలో ఎందుకు ఆశలు రేపాలని మహిళలు ముఖ్యమంత్రి, స్థానిక వైకాపా నాయకులపై మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల కోసం బటన్ నొక్కుతున్నారు. కానీ, అవి లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యేటప్పటికి ఐదారు నెలలు పడుతుంది. అప్పటికి ఏవో సాకులు చూపి కొంతమంది ఖాతాల్లో జమకావటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఏదేమైన ఆసరా నాలుగో విడత విషయంలో మహిళలు ముఖ్యమంత్రిపై మండిపడుతున్నారు. ఎన్నికల దగ్గరపడుతున్న తరుణంలో ఇలాంటి పనులు చేయటం సరికాదని పలువురు విశ్లేషకులు వారి అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

33 మంది రక్తదానం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో మదనాపురంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తలసేమియా పిల్లల కోసం పాలకొండ పట్టణంలో ఉన్న గాయత్రి స్కూల్ ఆఫ్ నర్సింగ్, శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో చుట్టుపక్కల గ్రామ యువకులు 33 మంది రక్తదానం చేశారు. శ్రీకాకుళం న్యూ బ్లడ్ బ్యాంక్ నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో గాయత్రి స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, అచ్యుతారావు, ఆస్పత్రి మేనేజర్ ధర్మారావు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

అరసవల్లి అభివృద్ధికి దాతల విరాళాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి తమవంతు విరాళాలను పలువురు యాత్రికులు అందజేశారు. ఆదివారం ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఇఒ విహరి సూర్యప్రకాష్‌ను కలిసి విరాళాలను అందజేశారు. నగరానికి చెందిన స్వర్గీయ దండి సూర్యకాంతి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు ఎన్‌విఎస్ సురేష్ రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. అలాగే నగరానికి చెందిన మరోదాత పి.రేవతి, ఆమె తల్లి లక్ష్మి కలిసి ఆలయ అభివృద్ధికి రూ.1,55,000 విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలక మండలి సభ్యులు మండవిల్లి రవి పాల్గొన్నారు.

పెరిగిన ఆదాయం

ఆదివారం కావడంతో అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయానికి యాత్రికులు తరలివచ్చారు. రద్దీ కారణంగా ఆలయానికి టికెట్లు విక్రయాల ద్వారా రూ.90,500, విరాళాల రూపంలో రూ.71,954, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,82,000 ఆదాయం సమకూరినట్టు ఇఒ వి. హరి సూర్య ప్రకాష్ తెలిపారు.

ఆమె నేత్రాలు సజీవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పద్మావతమ్మ

నగరంలో డేఅండ్‌నైట్ సమీపాన నివాసముంటున్న చార్టర్డ్ అకౌంటెంట్ కె.దుర్గా శ్రీనివాస్ తల్లి పద్మావతమ్మ (85) ఆదివారం కున్ను మూశారు. ఆమె తన నేత్రాలను దానం చేసేందుకు గతంలో అంగీకారం తెలపడంతో కుటుంబసభ్యులు రెడ్‌క్రాస్‌కు సమాచారం తెలియజేశారు. వారి అభ్యర్థన మేరకు రెడ్‌క్రాస్ సభ్యులు ఆమె కార్నియాను సేకరించి విశాఖపట్నం ఎల్‌వి ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈసందర్భంగా ఆమె కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ సభ్యులు అభినందించారు.

28లోగా రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

పోలాకి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రుణాలు తీసుకున్న రైతులు ఈ నెల 28 లోగా రుణాలు రెన్యువల్ చేసుకోవాలని సొసైటీ అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు తెలిపారు. సొసైటీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సొసైటీలో తీసుకున్న వ్యవసాయ రుణాలు సకాలంలో రెన్యువల్ చేసుకుంటే ప్రభుత్వం ద్వారా అందిస్తున్న 7 శాతం రాయితీలు వర్తిస్తుందని అన్నారు. ఈ నెల దాటితే 13 శాతం వడ్డీ పడుతుందని, దీనిని గమనించాలని కోరారు. రెన్యువల్‌కి వచ్చేటప్పుడు ఆదార్ కార్డు, 1బి, రేషన్ కార్డు, ఫొటోలు, బ్యాంకు ఎకౌంట్ నంబరు, ఫోన్ నంబరు తీసుకురావాలన్నారు. ఈయన వెంట సిఇఒ బంటుపల్లి రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

శ్రీకాకుళం అర్బన్: మండలం మొపసుబందరు గ్రామంలో సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాస్, సన్‌రైజ్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు శ్రీనివాస్

శివ సాగర్ తీరంలో సినిమా షూటింగ్

షూటింగ్‌లో పాల్గొన్న చిత్ర బృందం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో సినీ నిర్మాణ సంస్థ ఆశ్యన్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యాన 'క్రష్ లవ్' మూవీ సినీ షూటింగ్ ఆదివారం నిర్వహించారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం సిమ్ము వహిస్తున్నారు. హీరో కౌశిక్, హీరోయిన్ సాహితీశ్రీనివాస్, ఉత్తరాంధ్ర సినీ నటులు అమ్మ రామకృష్ణలపై సన్నివేశాన్ని సముద్ర తీరంలో చిత్రీకరించారు. నిర్మాత శివాని కావూరి, నటులు జామి శ్రీను, కోరాడ రాంప్రసాద్, దుర్గాకాంత్ గ్రీన్ ఆర్మీ సభ్యులు దాసరి శ్రీనివాసరావు, నగిరి లక్ష్మి, హైమావతి తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రాంతానికి చెందిన నటుడు అమ్మ రామకృష్ణ 'పలాస, జయమ్మ పంచాయితీ, వీరగున్నమ్మ, పల్లె గూటికి పండగ వచ్చింది, కట్టే కొట్టే తెచ్చే' వంటి చిత్రాల్లో వివిధ రకాల విలక్షణమైన పాత్రలో నటించి ప్రేక్షకులు మెప్పించారు. ప్రస్తుత చిత్రంలో ప్రతి నాయకుడు పాత్రలో నటిస్తున్నారు. మరెన్నో చిత్రాల్లో మంచి పాత్రలతో సినీ రంగంలో రాణించాలని గ్రీన్ ఆర్మీ టీం అధ్యక్షులు బోనేల గోపాల్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సినిమాకు సినీ ఫొటోగ్రాఫర్‌గా పలాస వాసి పవన్ కందికుప్ప మంచి అవకాశాలు అందిపుచ్చుకొని సినీ రంగంలో రాణించాలని ఆకాంక్షించారు.

సామాజిక కార్యక్రమాలతోనే సంతృప్తి

సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

సామాజిక కార్యక్రమాలతోనే సంతృప్తి వస్తుందని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. ఆదివారం మండలంలో వంజంగిలో యండ చిట్టయ్య - గణపతి చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ మాజీ సర్పంచ్ యండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభం కావడం ఆనందంగా ఉందని, ఈ ట్రస్టు ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు విశేష సేవలు అందించాలన్నారు. గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో విద్య, వైద్యసేవలతో పాటు అన్ని రకాల సేవలను అందించాలని తెలిపారు. మాజీ సర్పంచ్ యండ అప్పలనాయుడు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా పేద విద్యార్థుల చదువుకు ఆర్థికసాయాన్ని, వైద్య సేవలను పేదలకు అందిస్తామన్నారు. తమ ట్రస్టు ద్వారా విద్యార్థులకు రోగులకు భవిష్యత్‌లో అందించే సేవలను వివరించారు. నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బొడ్డేపల్లి గౌరీపతిరావు ట్రస్ట్‌కు రూ.50 వేలు ఆర్థికసాయాన్ని ఆయన తల్లిదండ్రుల పేరిట ప్రకటించారు. కార్యక్రమంలో వైసిపి నాయకుడు కోట గోవిందరావు, ఎజిపి సీపాన గోవిందరావు, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, సామాజిక కార్యకర్త సనపల నారాయణరావు, సర్పంచ్ పైడి లక్ష్మి పాల్గొన్నారు.

పెన్షనర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

ఆమదాలవలస: ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సురవరపు సిమ్మినాయుడు, బొడ్డేపల్లి జనార్దనరావులను పెన్షనర్ల సంఘసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలో లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో పెన్షనర్ల సంఘం రెండవ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు నివేదికను ప్రవేశ పెడుతూ పెన్షనర్లకు రావలసిన 185 నెలల డిఎ, ఎరియర్లను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, మధ్యంతర భృతి ఐఆర్‌ను 30 శాతాన్ని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘ గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల పట్ల వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ సకాలంలో జీతాలు, పెన్షన్లు చెల్లించడం లేదన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని హెచ్‌వి సత్యనారాయణ ప్రతిపాదించగా పేడాడ అప్పారావు బలపరిచి కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం గౌరవ అధ్యక్షులుగా బొడ్డేపల్లి మోహనరావు, కోశాధికారిగా హెచ్‌వి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పి. వైకుంఠరావు, డి.లక్ష్మణరావు, ఎన్.చంద్రశేఖరరావు, ఆర్.సత్యనారాయణ, కె.షణ్ముఖరావు, బి.సత్యనారాయణ, బి.వి. రమణ, కార్యదర్శులుగా పివిఎన్ మాస్టారు, పి.బానోజీరావు, కె.జనార్దనరావు, బి.నారాయణ, బి.సత్యనారాయణ, కె.వి.రాజారావులను ఎన్నుకొన్నారు. ఎన్నికల అధికారిగా దాస్యం లక్ష్మణరావు వ్యవహరించారు.

మాట్లాడుతున్న రమణ

సమ్మెను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల హామీలను విస్మరించి, దేశ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ కోరారు. నగరంలో క్రాంతి భవన్‌లో ఆదివారం సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ 2014 ఎన్నికల ముందు మోడీ వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని, ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు కల్పిస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు ఇస్తామని తిరుపతిలో హామీ ఇచ్చిన మోడీ మట్టికుండ ఇచ్చాడని ఆరోపించారు. మోడీ పదేళ్ళ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలు, ఆస్తులను అంబానీ, ఆదానీ వంటి కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా ధారాదత్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికుల హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు. ధరలు పెంచి సామాన్య, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల పోలారావు, ఉప్పాడ సూర్యనారాయణ, బమ్మిడి వేణు, రాజు, గణేష్, అప్పారావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం అర్బన్: ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఈనెల 7 నుంచి 11వరకు విజయవాడలో నిర్వహిస్తున్నట్టు యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డివిటి రాజు, నరవ మహేశ్వరరావు తెలిపారు. ఆదివారం నగరంలో సంఘ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మందులపై జిఎస్‌టిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అత్యవసర మందులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టి, ధరలు నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. నాసిరకం, కల్తీ మందుల విక్రయాలను అరికట్టి తయారీ సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ప్రజారోగ్యానికి ముప్పు తప్పదని హెచ్చరించారు. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ చట్టం పరిరక్షించి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎల్. శ్రీకాంత్, ఉప కార్యదర్శులు బి.వెంకటరావు, ఎం.శంకరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మెడికల్ రిప్స్

క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న శిరీష

ఆటో బోల్తా : 15 మందికి గాయాలు

ప్రజాశక్తి- మందస

మందస మండలం హరిపురం జాతీయ రహదారిపై ఆదివారం అదుపు తప్పి ఆటో వరద కాలువలో బోల్తా పడడంతో 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. సంతబొమ్మాళి మండలం మర్రిపాడుకు చెందిన కొంతమంది కవిటి మండలం బొరివంకలోని అమ్మవారిని దర్శనానికి వెళ్లారు. తిరిగి ఆటోలో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ సమయంలో అటువైపు వెళ్తున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆటో ప్రమాదాన్ని గమనించి వారి వద్దకు చేరుకొని క్షతగాత్రులను మనోధైర్యం కల్పించారు. 108కు ఫోన్ చేసి గాయపడిన వారిని హరిపురం ప్రభుత్వాస్పత్రికి దగ్గరుండి తరలించారు. ఈ సంఘటనపై మందస పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒకేసారి మూడు ప్రమాదాలు

టెక్కలి రూరల్ : టెక్కలిలో ఆదివారం రాత్రి పోర్టు వాహనం మరోసారి కలకలం రేపింది. స్థానిక ఇందిరాగాంధీ కూడలి వద్ద కారును పోర్టు వాహనం ఢీకొన్నంది. కాగా, రాత్రి మరో పోర్టు వాహనం ఎదురుగా వస్తున్న ఒక బైకును ఢీకొంది. రాంగ్ రూట్‌లో వచ్చిన వాహనం బైకును బలంగా ఢీకొనడంతో అలజడి నెలకొంది. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే టెక్కలి గోపీనాథపురం రైల్వే గేటు సమీపంలో టిప్పర్ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసమైంది.

ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

అభివృద్ధే జగనన్న లక్ష్యం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి పాలన ఉందని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే నర్తు రామారావు అన్నారు. మండలంలోని ఈదుపురం పంచాయతీలో నాడు-నాడు నిధులతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ పాలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. జగనన్న ప్రభుత్వం సుపరిపాలన ప్రయోజనాలు, సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి వద్దకే చేరుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ నర్తు ప్రసాద్, ఎంపిటిసి నర్తు ప్రేమ్ పాల్గొన్నారు.

పాల్గొన్న పిఎంపిలు

రాష్ట్ర సదస్సులో పిఎంపిలు

శ్రీకాకుళం : విజయవాడ అనుమోలు గార్డెన్స్‌లో ఎపి సామాజిక వైద్య సహాయకుల సంఘాల సమాఖ్య వార్షికోత్సవ రాష్ట్ర మహాసభలు, కేన్సర్‌పై అవగాహనా సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సు ఫెడరేషన్ ఆఫ్ కమ్యూనిటీ పారామెడిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సుకు పిఎంపి జిల్లా అధ్యక్షులు వండాన సిమ్మన్న, కోశాధికారి నక్క లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు కె.ఆదినారాయణ, సహాయ కార్యదర్శి కె.జనార్ధనరావులు పాల్గొన్నారు.

7న జీడి ఫలసాయానికి వేలం పాట

ప్రజాశక్తి- పోలాకి

ఈ నెల 7న మధ్యాహ్నం 2 గంటలకు కోడూరు రెవెన్యూ పరిధిలో జీడి ఫలసాయానికి వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఉషశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. కోడూరు పంచాయతీలోని ప్రభుత్వం జీడి తోట 2023-24 ఏడాదికి గాను వాటి ఫలసాయం పొందేందుకు వేలం పాట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పాటలో పాల్గొని పాటదారులు రూ.లక్ష సాల్వెన్స్ ధ్రువపత్రం పొందాలన్నారు. ప్రథమ ధరావత్‌గా రూ.30 వేలు మండల పరిషత్ అబివృద్ధి అధికారి పేరున ఎస్‌బిఐలో చెల్లుబాటయ్యే విధంగా డిడి తీసుకురావాలని చెప్పారు. పాట నిఖరం తేలిన తరువాత మొత్తం డబ్బులను వెంటనే చెల్లించాలన్నారు. లేని యడల ధరావత్ డబ్బులు తిరిగి చెల్లించబడవు అన్నారు. ఈమెతో పాటు సూపరింటెండెంట్ బి.సూర్యప్రకాష్ ఉన్నారు.

ఏర్పాటు చేసిన సిసి కెమెరా

నిఘాలో టెక్కలి జిల్లా ఆస్పత్రి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి జిల్లా ఆస్పత్రిలోని పలు కీలక విభాగాల వద్ద అధికారులు సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలోని ఎమెర్జెన్సీ క్యాజువాలిటీ, ప్రసూతి విభాగం, ఓపి తదితర ముఖ్య విభాగాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా ఉంచారు. వైద్యులు, సిబ్బంది రాకపోకలు పరిశీలనతో పాటు అనుమానాస్పద వ్యక్తుల సంచారాన్ని గుర్తించేందుకు సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బొడ్డేపల్లి సూర్యారావు తెలిపారు.

మంత్రి పరామర్శ

నందిగాం: విజయనగరం జిల్లా బొండపల్లి తహశీల్దార్ సనపల రమణయ్య కుటుంబ సభ్యులను పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదివారం పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈయన వెంట వైసిపి ఎంపీ అభ్యర్థి పి.తిలక్, పిఎసిఎస్ అధ్యక్షులు బి.మధుసూదనరావు, అట్టా శ్రీనివాసరావు ఉన్నారు.

రాంబాబు బాటలో నడుద్దాం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పీడిత ప్రజల కోసం ప్రాణాలను త్యాగం చేసి అమరుల పోరాట స్ఫూర్తిని నింపుకొని మడ్డు రాంబాబు నాయకుడిగా నిలిచారని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ అన్నారు. విప్లవ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన మండలంలోని అక్కుపల్లిలో ఆదివారం రాంబాబు స్మారక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాంబాబు పీడితి ప్రజల పక్షాన పోరాడి ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయరని అన్నారు. ఆయన బాటలో మరింత పోరాట దీక్షతో సాగడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో మడ్డు అనిల్, కోనేరు గురయ్య, రాపాక మాధవరావు, కుత్తుమ హేమక్క, కుత్తుమ జానకమ్మ, జె.అప్పయ్య, బైరాగి, భాస్కరరావు, మడ్డు రాఘవులు, కె.భీమారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టాలెంట్ టెస్టు

ఇచ్ఛాపురం : జిల్లా ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన మండల స్థాయి ఫిజికల్ 19-సైన్స్ ట్యాలెంట్ టెస్టులో 12 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ టాలెంట్ టెస్ట్ పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్ష సమయంలో ఎంగానో ఉపయోగపడుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు శేషగిరి, గణపతి, రాణీబెహరా, నులూప్కుమార్ పాడి పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

నందిగాం సర్పంచ్‌కు సన్మానం

నందిగాం : స్థానిక మండల పరిషత్ సమావేశ ప్రాంగణంలో నందిగాం సర్పంచ్ జె.రమణమ్మకు ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి ఆదివారం సన్మానించారు. జనవరి 26 న్యూఢిల్లీలో రిపబ్లిక్ డే సందర్భంగా ఆహ్వానం మేరకు సర్పంచ్ రవణమ్మకు చేరుకున్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రులు గిరిరాజ్ సింగ్, కపిల్ మోరేశ్వర్పాటిల్ చేతుల మీదుగా సత్కారం పొంది ప్రశంసా పత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, సంజీవిరావు, జె.జయరామ్, ఆర్.లక్ష్మీకాంత్, ఎల్.ధనరాజ్ పాల్గొన్నారు.

ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రబీలో వేసుకున్న పంటలన్ని తప్పనిసరిగా ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి దానకర్ణుడు తెలిపారు రైతులు విధిగా రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి భూమి యొక్క వివరాలు, ఆధార్ నెంబరు, ఫోన్ నెంబరు ఇచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు ఈ నెల 15లోగా ఇ-క్రాప్ నమోదు, ఇకెవైసి పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలు వర్తిస్తాయని తెలిపారు.

జీవామృతం తయారీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

జీవామృతం తయారు చేస్తున్న రైతులు

జీవామృతం పిచికారితో చెరుకు పంట సాగు లాభదాయకంగా ఉంటుందని మండల ప్రకృతి వ్యవసాయ యాంకర్ నక్క చిరంజీవి అన్నారు. ఆదివారం మండలంలో చేపేనపేట క్లస్టర్ పరిధిలో నిమ్మతొర్లాడలో చెరుకు సాగు చేస్తున్న రైతులు తక్కువ ఖర్చుతో జీవామృతం తయారు చేసి వాటిని పంట పొలంలో పిచికారి చేయడం వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. తక్కువ ఖర్చుతో భూమికి కావాల్సిన సూక్ష్మ పోషకాలను అందించడంలో జీవామృతం ఎంతో దోహదపడుతుందన్నారు. జీవామృతం తయారీకి ఎక్కువ డబ్బులు ఖర్చు కాదని, ప్రతి రైతు సులభంగా తయారు చేసుకోవచ్చని చిరంజీవి రైతులకు వివరించారు.

పుస్తక ప్రదర్శన

పుస్తకాలను ప్రదర్శిస్తున్న రూపావతి

టెక్కలి : టెక్కలి శాఖాగ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శనను గ్రంథాలయాధికారి బి.రూపావతి నిర్వహించారు. ప్రస్తుతం పలు పోటీతత్వ పరీక్షలకు సంబంధించి నోటిఫికేషన్లు వెలువడిన దృష్ట్యా ఆసక్తి గల నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. వారు చదువుకోవడానికి వీలుగా గ్రంథాలయంలో అన్ని రకాల పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. నిరుద్యోగ అభ్యర్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆంగ్లం, తెలుగు భాషల్లో కూడా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన, చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతినెల మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహిస్తామని, విద్యార్థుల కోసం బాలసాహిత్యం, చిన్నారుల కథలు, పంచతంత్రం కథలు అందుబాటులో ఉంచామని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులను గ్రంథాలయం తరపున అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపితోనే సంక్షేమ పాలన

టిడిపిలో చేరిన వారితో అప్పల సూర్యనారాయణ, లక్ష్మీదేవి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

టిడిపితోనే ప్రజలకు సంక్షేమ పాలన అందుతుందని, చంద్రబాబు నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. ఆదివారం చాపురం పంచాయతీ పరిధిలో 80 కుటుంబాలు రెడ్డి చిరంజీవి సమక్షంలో టిడిపిలో చేరారు. అరసవల్లిలో వారి స్వగృహంలో పార్టీలోకి ఆహ్వానించి టిడిపి కండువాలు కప్పారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే భవిష్యత్‌కు గ్యారంటీతో ప్రకటించిన పథకాలన్నింటిని తక్షణమే అమలు చేస్తామన్నారు. ప్రజలకు సంక్షేమ పాలన, అభివృద్ధి రెండు కళ్ల వంటివని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను ఐదేళ్ల పాలనలో వైసిపి విస్మరించిందన్నారు. చంద్రబాబు సిఎం అయితే ప్రజలకు మంచి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో జోగారావు, అల్లు రమేష్, అల్లు శ్రీరాములు, మట్ట ఢిల్లేశ్వరరావు, తిప్పన శ్రీనివాసరావు, అంపోలు శ్యామలరావు, టిప్పన సంతోష కుమార్, మండల టిడిపి అధ్యక్షులు సీర రమణయ్య, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు చిట్టి మోహన్, అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు బలగ చెంగలారావు, మాజీ సర్పంచ్ సురాడ అప్పన్న పాల్గొన్నారు.

పల్లెపల్లెకు టిడిపి

పలాస : మాట్లాడుతున్న బాబూరావు

పలాస : టిడిపి పూర్వ వైభవానికి కార్యకర్తలు కృషి చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 9, 22వ వార్డులో పల్లెపల్లెకు టిడిపి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లోడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, యవ్వరి మోహనరావు, శాసనపూరి మోహనరావు, జోగ మల్లి, జ్యోతినాయిక్, డిక్కల ఆనంద్, నబిల్లి శ్రీనివాసరావు, రమణ, ప్రసాద్, ప్రధాన్, కొల్లి కూర్మారావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని పూడిజగన్నాథపురంలో మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి పుచ్చ ఈశ్వరరావు అధ్యక్షతన మాజీ సర్పంచ్ తిమ్మల కృష్ణారావు ఆధ్వర్యాన పల్లెపల్లెకు టిడిపి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సూళ్ల చిట్టిబాబు, బూత్ కన్వీనర్ తిమ్మల గణపతి, సర్పంచ్ అఖిల్, యూనిట్ ఇన్‌ఛార్జి ఎం.పాపారావు, గుళ్ల చిన్నారావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

సమావేశంలో మాట్లాడుతున్న తిలక్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

నాయకులు, గ్రామ పెద్దలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కళింగ కార్పొరేషన్ చైర్మన్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని మాసాహెబ్‌పేట పంచాయతీ కమలనాభపురంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్, సర్పంచ్ సంపతిరావు హేమసుందరరాజు, ధనలక్ష్మిల కుమార్తె కుమారిశ్రీ జ్ఞాపకార్థం ఏర్పటు చేసిన కుమారిశ్రీ ఛారిటిబుల్ ట్రస్టు ఆధ్వర్యాన తాగునీటి వాటర్ ప్లాంట్ (ఆర్‌ఒ)కు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు తాగునీరు, మంచి భోజనం, ప్రశాంత వాతావరణ అవసరమని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, వైసిపి నాయకులు అన్నెపు రామారావు, నూక సత్యరాజు పాల్గొన్నారు.

'ఉషోదయ' భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- కవిటి

కవిటి ఉషోదయ యువజన సంఘం నూతన భవన నిర్మాణానికి జెడ్‌పి చైర్పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు సాయిరాజ్, నరేష్‌కుమార్ అగర్వాల్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవకాశం ఉన్నంత వరకూ అన్ని తరగతుల సంక్షేమాన్ని పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. రూ.10 లక్షలు జెడ్‌పి నిధులతో భవనం నిర్మించనున్నట్లు ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్ అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, ఆరింగి మధు, బెందాళం చిట్టిబాబు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆస్పత్రిలో పింఛన్ల అందజేత

ప్రజాశక్తి- లావేరు

మండలంలో గుమ్మడాం పంచాయతీకి చెందిన గ్రామ వాలంటీర్ వృద్ధాప్య పింఛన్లను తన సొంత ఖర్చులతో విజయవాడ వెళ్లి అందించారు. గ్రామానికి చెందిన యాలాల ఆదినారాయణ, యాలాల నారాయణమ్మ దంపతులు వృద్ధులు. వీరు గుమ్మాడాంలోనే ఉంటున్నారు. ఇటీవల వీరు అనారోగ్యానికి గురి కావటంతో తన కుమారులు విజయవాడకు తీసుకెళ్లారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫిబ్రవరి నెల పింఛను మంజూరు కావడంతో ఆదినారాయణకు వృద్ధాప్య, నారాయణమ్మకు అభయహస్తం పింఛన్‌ను వాలంటీర్ నాగం సింధు విజయవాడ వెళ్లి పింఛను సొమ్మును అందించింది. వాలంటీర్ చొరవకు ఎంపిడిఒ భాస్కరరావు, సర్పంచ్ గంధవరపు పైడియ్య, ఉప సర్పంచ్ ధర్మారావు, ఎంపిటిసి జగ్గురోతు తవిటినాయుడు, వైసిపి నాయకులు శ్రీరాములు, నాగం కనకరాజు, గ్రామస్తులు సింధును అభినందించారు.

సన్మానిస్తున్న అప్పలసూర్యనారాయణ దంపతులు

ఆనందరావు సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో మందిని తీర్చిదిద్దడం ద్వారా మంచిపేరు సంపాదించుకోవచ్చని, అటువంటి కీర్తి గార మండలం కళింగపట్నంకు చెందిన పొట్నూరు ఆనందరావు సంపాదించుకున్నారని మాజీమంత్రి గుండ అప్పలసూర్యనారాయణ పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఆనందరావును ఆదివారం నగరంలో కొయ్యన కన్నయ్య కాలనీలో గ్రీన్స్ కళ్యాణ మండపంలో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయనకు శాలువకప్పి సన్మానం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో పాటు టిడిపి నాయకులు పొట్నురు కృష్ణమూర్తి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జల్లు రాజీవ్, కార్యనిర్వహక కార్యదర్శి గంగు ప్రభాకర్, మాజీ ఎఎంసి డైరెక్టర్ పొట్నురు వైకుంఠరావు, ఎన్ని గోపి, సందయ్య పాల్గొన్నారు.

పోస్టర్లను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు శేషగిరి

'రాష్ట్రాన్ని దోచుకుంటున్న వైసిపి'

ప్రజాశక్తి- పొందూరు

ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకుందని టిడిపి మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహన్, బాడాన శేషగిరినాయుడు అన్నారు. మండలం రాపాక, రెడ్డిపేట గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పలు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, కొంచాడ బుజ్జి, కొంచాడ అప్పలనాయుడు, సుమల రామకృష్ణ, పట్నాన పారంనాయుడు, వెంకటేష్, గోవింద్, తిరుపతి, బాలకృష్ణ పాల్గొన్నారు.

వైసిపిలో పలువురి చేరిక

టెక్కలి రూరల్: మేజర్ పంచాయతీ టెక్కలి పట్టణానికి చెందిన 60 వైశ్య కుటుంబాలు శనివారం ఎమ్మెల్సీ, వైసిపి టెక్కలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో వార్డు సభ్యులు కింతలి తిరుమలకుమార్, వైశ్యరాజు శోక్ నేతృత్వంలో వైసిపిలోకి ఆదివారం చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వర్తక, వైశ్య సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ దువ్వాడ శ్రీనివాస్ ఎమ్మెల్యేగా గెలిపించేందుకు పూర్తి స్థాయిలో పనిచేస్తామని చెప్పారు.